క్లుప్తంగా

నేటి నుంచి వైఎస్సార్ సీపీ సమావేశాలు

వత్సవాయి: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం నుంచి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ' బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆపార్టీ మండల అధ్యక్షుడు గుత్తా శంకరరావు తెలిపారు. రోజుకు రెండు గ్రామాల చొప్పున ఆగస్టు ఆరోతేదీ వరకు ఈ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశాల్లో గ్రామకమిటీ, అనుబంధ సంఘాల కమిటీల ఎంపిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆయాగ్రామాల్లో సాయంత్రం 4గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

విద్యార్థినికి సత్కారం



పోచవరం(వత్సవాయి): వేలేరు నవోదయ పాఠశాలకు ఎంపికైన పోలవరం ఎంపీపీ పాఠశాల విద్యార్థిని దారెల్లి దీపాళిని యూటీఎఫ్ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు, జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణయ్య, జే సుధానంద్, హెచ్ఎం జి.సునీల్, యూటీఎఫ్ నాయకులు అజ్మరు శ్రీను, సుబ్రమణ్యం, పి.వెంకటేశ్వరరావు, పి.శ్రీను, ఎస్కే హుస్సేన్, సీఆర్పీ వై.రవిబాబు పాల్గొన్నారు.

వర్షపునీరు నిల్వ లేకుండా చర్యలు



సాక్షి ఎఫెక్ట్

వత్సవాయి: మక్కపేట రైల్వే అండర్‌పాస్ వర్షపునీరు నిలబడి ప్రయాణికులకు ఇబ్బందిగా మారడంపై 'ఇంకెన్నాళ్లీ బాధలు' శీర్షికన 'సాక్షి' దినపత్రిక ప్రచురించిన కథనానికి పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన మాదినేని విక్రమ్ అనేవ్యక్తి స్పందించారు. తన సొంతఖర్చులతో జేసీబీని ఏర్పాటుచేసి వర్షపు నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్త, పూడిక మట్టిని తొలగించి వర్షపునీరు ముందుకుసాగేలా కాల్వను తవ్వించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న 'సాక్షి' దినపత్రికకు, విక్రమ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

గోరింటాకు పండుగ



గండ్రాయి(జగ్గయ్యపేట): మండలంలోని గండ్రాయి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం గోరింటాకు పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఆషాఢమాసం సందర్భంగా గోరింటాకు పెట్టుకుని సందడి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నేలవెల్లి రమేష్‌బాబు, దైవాదీనం, పద్మావతమ్మ, ముక్తేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయాలు ముస్తాబు

నందిగామ రూరల్: మండలంలోని ఆలయాలు శ్రావణమాస ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. శుక్రవారం నుంచి శ్రావణమాసం ప్రారంభం కానుండటంతోపాటు తొలి శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయాలను కమిటీ సభ్యులు, అధికారులు సర్వాంగ సుందరంగా అలంకరించారు. పల్లగిరి గట్టుపై త్రిశక్తి పీఠంలో వేంచేసియున్న కనకమహాలక్ష్మి, కనకదుర్గ, జ్ఞానసరస్వతి అమ్మవార్లకు, పట్టణంలోని మరిడీ మహాలక్ష్మి, వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయాలలో శ్రావణమాస ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

మలేరియా ఉద్యోగి అదృశ్యంపై ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ మలేరియా సెక్షన్‌లో అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్‌గా పనిచేస్తున్న ధారావత్ రవిచంద్ర సూర్యకుమార్(48) అదృశ్యంపై అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ధారావత్ రవిచంద్ర సూర్యకుమార్, సుబ్బలక్ష్మి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి అజిత్‌సింగ్‌నగర్ ఇందిరానాయక్ నగర్‌లో నివసిస్తున్నారు. ఈ క్రమంలో రవిచంద్ర సూర్యకుమార్ బుధవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో ఆఫీస్‌కు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి 7 గంటలు అయినా ఇంటికి రాకపోవడంతో భార్య ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. గురువారం కూడా ఇంటికి చేరుకోకపోవడంతో భార్య సుబ్బలక్ష్మి బందరు రోడ్‌లోని జిల్లా మలేరియా ఆఫీస్‌కు వెళ్లి విచారించగా రవిచంద్ర సూర్యకుమార్ బుధవారం సాయంత్రం ఆఫీస్‌కే రాలేదని తెలిపారు. దాంతో ఆమె బంధువుల ఇళ్లల్లో, రైల్వేస్టేషన్, బస్టాండ్‌లల్లో వెతికింది. అయినా అతని ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దమ్ము చక్రాల ట్రాక్టర్లతో రోడ్లు ధ్వంసం

- నిబంధనలు పాటించని వైనం
- పట్టించుకోని అధికారులు

పెనుగంచిప్రోలు: ఖరీఫ్ వరిసాగు నేపథ్యంలో పొలాన్ని దమ్ము చేసేందుకు వినియోగించే ట్రాక్టర్లు రోడ్లపై ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్లు దెబ్బతింటున్నాయి. పొలం వద్ద ట్రాక్టర్లకు దమ్ము చక్రాలు బిగించుకోవాల్సి ఉండగా, ఇళ్ల వద్దనే వాటిని బిగించుకుని పొలాలకు వెళ్తుండటంతో రోడ్లు దెబ్బతింటున్నాయని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. మండల కేంద్రం పెనుగంచిప్రోలుతోపాటు అనిగండ్లపాడు, ముచ్చింతాల, గుమ్మడిదుర్రు, శివాపురం, సుబ్బాయిగూడెం, కొల్లికూళ్ల, వెంకటాపురం, వెంగనాయకునిపాలెం తదితర గ్రామాలతోపాటు వత్సవాయి మండలంలోని రేగులగడ్డ, ఆళ్లూరుపాడు, లింగాల, శింగవరం తదితర గ్రామాల పక్కగా మునేరు ప్రవహిస్తోంది. మునేరుకు వరద నీరు రావడంతోపాటు బోర్లు కింద నాట్లు బాగా ఊపందుకున్నాయి. దీంతో పొలాలకు దమ్ము చేసేందుకు చక్రాలతో రోడ్లమీదకు వస్తున్నాయి. వీల్స్ ధాటికి రోడ్లపై పెద్దపెద్ద గోతులు పడుతున్నాయి. అసలే వర్షాలకు దారుణంగా ఉన్న రోడ్లపై దమ్ము చక్రాలు తిరగడంతో రోడ్లు దెబ్బతింటోంది.

పాటించని నిబంధనలు

రోడ్లు ధ్వంసం కాకుండా ట్రాక్టర్ల యజమానులు కనీస నిబంధనలు కూడా పాటించటం లేదు. దమ్ము చక్రాలకు చుట్టూ ఇనుప రింగ్‌ను అమర్చి రాకపోకలు సాగించాల్సి ఉంది. కనీసం చక్రాలకు పట్టాలు అయినా కట్టాలి. దమ్ముచక్రాలతో ప్రధాన రహదారిపైకి ట్రాక్టర్లు రాకుండా చూడాలి.

ఎవరికీ పట్టని వైనం.....

లక్షల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన రహదారులు నాశనం అవుతున్నా పట్టించుకునే అధికారులు లేకపోవడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు అతిక్రమించి దమ్ముచక్రాల ట్రాక్టర్లు రోడ్లపై తిరుగుతున్నా ఆర్అండ్‌బీ, పోలీస్, ఆర్టీఏ అధికారులు ఎవరూ పట్టించుకోక పోడంటం విడ్డూరంగా ఉందని ప్రజలు అంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి దమ్ముచక్రాల ట్రాక్టర్లు రోడ్లపై తిరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



దమ్ము చక్రాలతో వెళ్తున్న ట్రాక్టర్



దమ్ము చక్రాల కారణంగా గుమ్మడిదుర్రు వద్ద ధ్వంసమైన రహదారి

చర్యలు తీసుకుంటాం..



దమ్ముచక్రాలతో ట్రాక్టర్లు రోడ్లు పైకి రాకూడదు. లక్షలు వెచ్చించి నిర్మించిన రోడ్లు దెబ్బతింటాయి. రహదారులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. దమ్ముచక్రాలతో రోడ్లపై సంచరించే ట్రాక్టర్ల యజమానులపై చర్యలు తీసుకుంటాం.

– ఎంఎస్కె అర్జున్ ఎస్ఐ, పెనుగంచిప్రోలు

విజన్–2047పై సమావేశం నిర్వహణ

గరికపాడు(జగ్గయ్యపేట): విజన్–2047లో భాగంగా బంగారు కుటుంబాలను గుర్తించేందుకు అధికారులు వేగవంతంగా చర్యలు తీసుకోవాలని నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ సూచించారు. విజన్–2047లో భాగంగా గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో గురువారం నియోజకవర్గ స్థాయిలో అన్నిశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గ్రామాలలోని నిరుపేదలను గుర్తించడంతోపాటు వారిని ఆదుకునే దాతలను ముందుకు తీసుకురావాలని తెలిపారు. ముఖ్యంగా పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖాధికారులు బృందాలుగా ఏర్పడి గుర్తించాలని చెప్పారు.ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విజన్–2047 చేపడుతుందని తెలిపారు. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు రైతులు ముందుకు రావాలని అవసరమైతే గేదెలను కూడా పంపిణీ చేస్తామని వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి బాలాజీ కుమార్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్, ఎంపీడీవో నితిన్, కేవీకె కోఆర్డినేటర్ అచ్యుతరాజు, శాస్త్రవేత్త కృష్ణంరాజు, జగ్గయ్యపేట, నందిగామ, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలకు చెందిన ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో కె.బాలకృష్ణ

మునేరుకు భారీగా వరద

పెనుగంచిప్రోలు: మునేరుకు ఎగువన ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు మునేరుకు వరద నీరు బాగా వస్తోంది. గురువారం ఉదయం వరద నీరు తగ్గినా సాయంత్రానికి భారీగా చేరింది. శుక్రవారం ఉదయానికి వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వైరా–కట్టలేరు..

వీరులపాడు: మండలంలోని పల్లంపల్లి సమీపంలో వైరా కట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణితో కురుస్తున్న వర్షాలతోపాటు ఎగువ నుంచి వస్తున్న భారీ వరద కారణంగా వైరా–కట్టలేరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. దీంతో తహసీల్దార్ రవికుమార్ గురువారం వరద ప్రవాహాన్ని పరిశీలించి నందిగామ–వీరులపాడు మండలాల మధ్యన రాకపోకలను నిలిపివేశారు. ప్రజలు రాకపోకలు సాగించకుండా పోలీసు సిబ్బందితో కాపలా ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తిగాకపోవడంతో వర్షాలు పడిన ప్రతిసారి రాకపోకలు నిలిచిపోతున్నాయని, ఇప్పటికైనా పాలకులు స్పందించి అప్రోచ్ రోడ్డు పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పెనుగంచిప్రోలు కాజ్‌వే వద్ద మునేరు ప్రవాహం

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన

కంచికచర్ల: విద్యార్థులు జీవితంలో ఉన్నతశిఖరాలకు చేరాలంటూ క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని శక్తి టీం కోఆర్డినేటర్, ఏఎస్ఐ బంటు హనుమయ్య సూచించారు. మండలంలోని పెండ్యాల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా హనుమయ్య మాట్లాడుతూ విద్యార్థులు తమ సెల్‌ఫోన్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఏదేని సమస్య వచ్చినట్లయితే ఈయాప్ ద్వారా సమాచారం అందిస్తే తక్షణమే సమీపంలోని పోలీసులు అందుబాటులోకి వచ్చి సమస్యను పరిష్కరిస్తారన్నారు. బాలికలతో బాలురు మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలు వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. బ్యాడ్ టచ్ గుడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులను ర్యాగింగ్ చేయడం నేరమన్నారు. అటువంటి చర్యలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, శక్తి టీం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీం కోఆర్డినేటర్ హనుమయ్య

రైతులకు డ్రోన్లు పంపిణీ

జగ్గయ్యపేట అర్బన్: కిసాన్ డ్రోన్ పథకం కింద ఏడుగురు రైతులకు మంజూరైన రూ.9.80లక్షల విలువగల డ్రోన్లను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) గురువారం పంపిణీ చేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ వ్యవసాయాన్ని ఆధునీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. డ్రోన్ వినియోగంతో శ్రమ తగ్గుతుందని, సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. చిన్న, సన్నకారు రైతుల్ని సంఘాలుగా ఏర్పరచి వారికి 80శాతం రాయితీతో డ్రోన్‌ను అందించడంతోపాటు ఉచితంగా శిక్షణనిస్తున్నట్లు వివరించారు. డ్రోన్‌ల వాడకంతో ఖర్చులు తగ్గి వ్యవసాయ ఉత్పాదకత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కట్టా నరసింహారావు, ఏడీఏ భవాని, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



పేటలో రైతులకు డ్రోన్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, అధికారులు

ఘనంగా అయ్యంకి జయంతి వేడుకలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య 135వ జయంతి వేడుకలను స్థానిక సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్ పాఠకులతో కలసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక విలువ తెలిసిన అయ్యంకి వెంకట రమణయ్య గ్రంథాలయ ఉద్యమాలతో తెలుగునాట గ్రంథాలయాల ఏర్పాటుకు కారకులయ్యారని కొనియాడారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో పుస్తక హుండీ దాతల ద్వారా లభ్యమైన పుస్తకాలతో పుస్తక ప్రదర్శన నిర్వహించి, గ్రంథాలయానికి విచ్చేసిన పాఠకులకు వారు కోరిన పుస్తకాలను ఉచితంగా అందజేశారు. అనంతరం పాఠకులకు స్వీట్స్ పంపిణీ చేశారు. గ్రేడ్ –3 గ్రంథాలయ అధికారి కె.వి.ఎస్ ప్రసాద్, కె.ప్రణీత పాల్గొన్నారు.

ముగ్గురు బైక్ దొంగలు అరెస్ట్

కంచికచర్ల: బైక్ అపహరణలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులు రాహుల్, తిరుపతిరావు, పవన్‌కుమార్‌లను కంచికచర్ల పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బోనగిరి రాజు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లభ్యంకాని గల్లంతైన వ్యక్తి ఆచూకీ



కంచికచర్ల: వీరులపాడు మండలం తాటిగుమ్మి వైరా ఉపనదిలో మంగళవారం చేపల వేటకు వెళ్లి గల్లంతైన నాగార్జున తిరుపతిరావు(30) ఆచూకీ గురువారం కూడా లభ్యం కాలేదు. కంచికచర్ల మండలం వేములపల్లిలో ఎన్డీఆర్ఎఫ్ బృందం గురువారం గాలింపుచర్యలు చేపట్టింది. ఎన్డీఆర్ఎఫ్ బృందం రెండురోజులుగా విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నప్పటికీ అతని ఆచూకీ లభ్యం కాలేదు. గాలింపు చర్యలు శుక్రవారం కూడా కొనసాగుతాయని ఎన్డీఆర్ఎఫ్ బృందం ఆర్ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు.

400 మందికి కంటి పరీక్షలు



కంచికచర్ల : లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక సంస్కృతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఉపాధ్యాయులతోపాటు 400మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. 10మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. వారికి లయన్స్ క్లబ్ తరఫున కళ్లజోళ్లు అందజేస్తామని లయన్స్‌క్లబ్ సభ్యులు డాక్టర్ పుల్లగూర ప్రభాకరరావు తెలిపారు.కార్యక్రమంలో స్కూల్‌డైరెక్టర్ పి. రమేష్ బాబు, ప్రిన్సిపల్ అనూరాధ, లయన్స్‌క్లబ్ సభ్యులు వై.గాంధీ, ఎంఎస్ఆర్‌వీ ప్రసాద్, జూలూరి బాలగంగాధర్, టి.వెంకటప్పయ్య కోనేటి శ్రీనివాసరావు, సీఆర్పీ కిరణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్లు పంపిణీ

గరికపాడు(జగ్గయ్యపేట): ఎస్సీ సబ్‌ప్లాన్‌లో భాగంగా మంజూరైన మూడు కుట్టుమిషన్లను గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కుట్టుమిషన్లను సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని ఎమ్మెల్యే సూచించారు. సర్పంచ్ శ్రీనివాసరావు, కోఆర్డినేటర్ అచ్యుతరాజు, శాస్త్రవేత్త ప్రభావతి పాల్గొన్నారు.

నటుడు కోట మృతి తీరని లోటు

విజయవాడ కల్చరల్: సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతి సినీ రంగానికి తీరని లోటు అని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. పద్మశ్రీ ఘంటసాల చైతన్యవేదిక, శ్రీకళాభారతి, తెలుగు కళావాహిని ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై గురువారం సినీ సంగీత విభావరి, కోటశ్రీనివాసరావు సంస్మరణ సభ నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న నటుడు కోట అని అభివర్ణించారు. కోట వెంకటేశ్వరెడ్డి మాట్లాడుతూ బహు భాషా నటి బి. సరోజ అన్నారు. ఆకాశవాణి విశ్రాంత అనౌన్సర్ మాడుగుల రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం కోట శ్రీనివాసరావు పేరుతో పురస్కారాలను ప్రదానం చేయాలన్నారు. కార్యక్రమంలో కె. డేవిడ్‌రాజు, బి. వీరభద్రరావు, గోళ్ల నారాయణరావు, శింగంశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. గాయనీ గాయకులు రాజు, కొండేటి దుర్గానాగమణి, మల్లాది స్వాతి, నాగమణి, చిత్రగీతాలను ఆలపించగా.. వారిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.



చంద్రబాబు మోసాలు బట్టబయలు

జగ్గయ్యపేట: సూపర్‌సిక్స్ హామీల అమలు చేయకుండా సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని రామచంద్రునిపేట, తక్కెళ్లపాడు గ్రామాల్లో గురువారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తన్నీరు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. హామీలను అమలుచేయకపోవడమంటే ప్రజలను మోసం చేయడమేనని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల పేరుతో కూటమి నాయకులు చేసిన మోసాన్ని వివరించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. మద్యం అక్రమ కేసులో ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. మహాశక్తి పథకం ద్వారా 18ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ. 1500 ఇస్తామని చెప్పి, తీరా ఏడాది తర్వాత ఆ పథకాన్ని అమలుచేయాలంటే రాష్ట్రాన్ని అమ్మేల్సిందేనంటూ కూటమి నేతలు మాట్లాడుతుండటం సిగ్గుచేటని విమర్శించారు. ఆయా హామీలను అమలుచేసే వరకు ప్రజల తరఫున పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బూడిద నరసింహారావు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి మండవ శ్రీనివాసగౌడ్, ఎస్సీసెల్ కార్యదర్శి దర్శనాల వెంకటరమణ, రాష్ట్ర, జిల్లా విభాగ కార్యదర్శులు పృథ్వీరాజ్, బజారు సాయి, మాతంగి నాగబాబు, బీసీసెల్ అధ్యక్షుడు జువ్వాది నరసింహారావు, నాయకులు గడ్డం రామకృష్ణ, ముత్యాలు, బ్రహ్మనాయుడు, రాజు, రాయల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

వరద నీటిలోనే పంట పొలాలు



అనిగండ్లపాడు వద్ద వరద నీటిలో వరి పొలాలు



వేమవరం వద్ద వరద నీటిలో పంట పొలాలు

పెనుగంచిప్రోలు: మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువన తెలంగాణలో కూడా వర్షాలు కురుస్తుండటంతో పెనుగంచిప్రోలు మండలంలోని ఆయా వాగులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో రెండురోజు గురువారం కూడా మండలంలోని ముచ్చింతాల, అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు గ్రామాల పరిధిలోని పంటపొలాలు వరద నీటిలోనే ఉన్నాయి. వాగులు పోటెయడంతో వరద నీరు మొత్తం పొలాల్లోనే నిలిచి ఉంటోంది. దీంతో ఆ నీటిని ఎలా బయటికి పంపించాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. వత్సవాయి మండలం వేమవరం వద్ద గతేడాది గండ్లు పడిన ప్రాంతంలో ఈసారి భారీగా వరదనీరు చేరింది.

ప్రజల భాగస్వామ్యంతో సుపరిపాలన

తోటచర్ల(పెనుగంచిప్రోలు): రాష్ట్రంలో ప్రతిఒక్కరికీ మేలు జరిగేలా పాలన సాగుతోందని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. మండలంలోని తోటచర్ల గ్రామంలో గురువారం నిర్వహించిన సుపరిపాలన–తొలి అడుగు కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే సుపరిపాలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, మాజీ సర్పంచ్ వేముల సైదేశ్వరరావు, గ్రామాధ్యక్షులు వేముల వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ చుంచు రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు కరపత్రాలు అందజేస్తున్న మంత్రి టీజీ భరత్, పక్కన ఎమ్మెల్యే రాజగోపాల్

మల్టీపర్పస్ హాలు ప్రారంభం

జగ్గయ్యపేటఅర్బన్: బలుసుపాడు రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం రూ.15.88 లక్షలతో నిర్మించిన మల్టీపర్పస్ హాల్‌ను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య),అల్ట్రాటెక్ మాన్యుఫ్యాక్చరింగ్ సౌత్ సీఈవో అనిల్ బ జాజ్, యూనిట్ హెడ్ శివరాజ్ వరదరాజన్, జి.మోహన్‌కుమార్ గురువారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ గురుకుల పాఠశాల సందర్శన సందర్భంగా పిల్లల అవసరాలను గుర్తించి అల్ట్రాటెక్ సంస్థను మల్టీపర్పస్ హాల్‌ను నిర్మించాలని కోరగా వారు వెంటనే స్పందించి హాల్‌ను నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ గురుకుల పాఠశాల రాష్ట్రంలో ఐదు, జిల్లాలో ప్రథమస్థానంలో ఉండటం గర్వకారణమన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.లక్ష్మీసుజాత, అల్ట్రాటెక్ యూనిట్ సిబ్బంది, అధ్యాపక బృందం, నాయకులు శ్రీరాం ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

పద్యనాటకానికి పూర్వవైభవం తేవాలి

విజయవాడ కల్చరల్: పద్యనాటకం తెలుగు వారి ఆత్మ అని రంగస్థల ప్రముఖుడు అగురు త్రినాథనాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, సృజనాత్మక సమితి సహకారంతో సాయిహృదయా కళానాట్యమండలి గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో గురువారం మోహినీ విజయం పద్యనాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమాలను ప్రారంభించిన త్రినాథనాయుడు మాట్లాడుతూ పద్యనాటకానికి పూర్వవైభవం తీసుకురావాలన్నారు. రంగస్థల కళాకారుడు కొమ్మినేని సాంబశివరావు మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించాలని సూచించారు. కళాపీఠం కోశాధికారి జి. జీవన్‌కుమార్, మోడీ సూర్యనారాయణ పాల్గొన్నారు. కళాకారుడు కపిలేశ్వరపు పైడేశ్వరరావును నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. రంగస్థల నటులు మోహినీ విజయం పద్యనాటకాన్ని హృద్యంగా ప్రదర్శించారు. భస్మాసురునిగా అగురు త్రినాథనాయుడు, విష్ణుమూర్తిగా కేవీ రమణారావు, శంకరునిగా దుర్గారావు మాస్టారు, లక్ష్మీదేవిగా దుర్గ, మోహినిగా లక్ష్మీశ్రీ నటించారు.



మోహినీ విజయం నాటకంలోని ఓ సన్నివేశం